క్లుప్తంగా

నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకట రమణబాబు బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి తిరిగి ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పొదలకూరు: కలుపు మొక్కల అనర్థాలపై గురువారం పాలిటెక్నిక్ విద్యార్థులకు పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, ఎన్జీ రంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రసన్నరాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950వ సంవత్సరం ప్రారంభంలో యూఎస్‌ఏ నుంచి దిగుమతి చేసుకున్న గోధుమలతో పార్థీనీయం మొక్క భారత్‌లోకి ప్రవేశించినట్లు చెప్పారు. ఇది జీవవైవిధ్యం, వ్యవసాయ ఉత్పాదకతపై పెద్ద ఎత్తున ప్రభావం చూపుతుందన్నారు. స్కిన్ అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులు, గవద జ్వరాలకు కారణం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ఈ మొక్కలను పరిశోధన స్థానం పరిసర ప్రాంతాల నుంచి తొలగించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేఖదేవి, ఎస్‌కే హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణతేజ, అరుణమ్మ

కోవూరు: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ అన్నారు. మండలంలోని ఇనమడుగు గ్రామ పంచాయతీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 87 రకాల పనులను కల్పించాలన్నారు. అనుమతిన పనులను తప్పనిసరిగా జరపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీపీఓ సుస్మితారెడ్డి ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ నిర్మలందబాబా, సర్పంచ్ ప్రమీలమ్మ పాల్గొన్నారు.

పీఆర్ డైరెక్టర్ పరిశీలన

పొదలకూరు: పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఎం.కృష్ణతేజ గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. రాపూరుకు వెళ్తున్న ఆయన దారిలో ఈ కార్యాలయం వద్ద ఆగారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. శాఖపరమైన ప్రశ్నలడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డ్వామా పీడీ బి.శ్రీనివాసులు, ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ డి.దుర్గాదొరబాబు, పంచాయతీ సెక్రటరీలున్నారు.

28 నుంచి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్


రాజశేఖర్

మర్రిపాడు: 2024–25 పంట కాలానికి సంబంధించి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుందని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ గురువారం తెలిపారు. అక్టోబర్ 23 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్లను చేయనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత నవంబర్ 7 వరకు రూ.100, నవంబర్ 11వరకు రూ.400 అపరాధ రుసుంతో రిజిస్ట్రేషన్లను రెన్యూవల్ చేయనున్నట్లు తెలిపారు. 2024–25 పంట కాలానికి పొగాకు బోర్డు ఒక బ్యారెన్‌కు దక్షిణ ప్రాంత తేలిక నేలల్లో 3.37 హెక్టార్లలో 4,275 కిలోల పొగాకు పండించేందుకు అనుమతించినట్లు చెప్పారు. గత పంట కాలానికి కన్నా 625 కిలోలు అధికంగా పండించేందుకు అనుమతించినట్లు చెప్పారు. పొగాకు బోర్డు అనుమతించిన పరిమితి మేరకే రైతులు పొగాకును పండించాలని సూచించారు. అధికంగా పొగాకును పండించడం వల్ల డిమాండ్ తగ్గిపోయి సరైన గిట్టుబాటు ధరలు రావన్నారు. ఈ ఏడాది ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందన్నారు. బ్యారెన్లు, పొలాలు అధిక ధరలకు కౌలుకు తీసుకుని సాగుచేయడం వల్ల చాలా నష్టపోయే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల రైతులు పొగాకు పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో గెస్ట్ ఉపాధ్యాయులుగా పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పుష్పరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. 2018 డీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కమిషనర్ సూర్యతేజ


రోడ్డుపైకి వచ్చిన దుకాణాన్ని పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ అంతరాయాలకు కారణమయ్యే వారికి భారీ జరిమానాలను విధించడంతో పాటు కఠిన చర్యలు చేపడతామని కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం నుంచి సిరి మల్టీప్లెక్స్, ఏసీ సెంటర్ వరకు అధికారులతో కలిసి గురువారం పర్యటించిన ఆయన మాట్లాడారు. వివిధ కూడళ్లలోని ఐల్యాండ్లు, డివైడర్లను పరిశీలించి వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లపై ఎలాంటి సైన్‌బోర్డులను పెట్టొద్దని దుకాణదారులకు సూచించి, వీటిని తొలగించారు. నగరంలోని ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే జరిమానాలను విధించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామగ్రిని తొలగించేలా యజమానులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు. ఏసీ సెంటర్ కూడలిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు అవసరమైన మరమ్మతులు ఇతర వసతులను కల్పించేందుకు గానూ నివేదికలను సిద్ధం చేయాలని కోరారు.

తాగునీటి కనెక్షన్లను పరిశీలించాలి

ట్రంక్‌రోడ్డులోని లాడ్జిలు, హోటళ్లు ఇతర వాణిజ్య భవనాలను తనిఖీ చేసి వాటి అనుమతులు, డ్రైయిన్, తాగునీటి కనెక్షన్లను పరిశీలించాలని సూచించారు. ఏసీ సెంటర్ సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించడం, వ్యర్థాలను రోడ్డుపై వేయడాన్ని గమనించిన కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, ఎంహెచ్‌ఓ చైతన్య, సిటీ ప్లానర్ దేవీ కుమారి, టీపీఓ ప్రకాష్, డీఈఈ అనిల్, రెవెన్యూ అధికారి సమద్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు వేగవంతం

అల్లీపురంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ సూర్యతేజ తనిఖీ చేశారు. వివిధ విభాగాల్లో జరుగుతున్న శుద్ధి ప్రక్రియను ఆరాతీశారు. అనంతరం కేంద్రంలో పబ్లిక్ హెల్త్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని గృహాల డ్రైయిన్లు, కాలువలను అనుసంధానించి శుద్ధి కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అల్లీపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, డ్రైవర్స్ కాలనీలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిరంతరం పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం వెంకటేశ్వరపురంలోని నల్లకాలువలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గోవులను కట్టడి చేయకపోతే చర్యలు

రోడ్లపై గోవులను కట్టడి చేయకపోతే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని కమిషనర్ సూర్యతేజ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇదే అంశమై పలుమార్లు నోటీసులను జారీ చేసినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇక ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఆదాల



నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని కలెక్టరేట్లో కలెక్టర్ ఆనంద్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమ కేసుల వ్యవహారాన్ని తెలియజేశారు. ఉప్పుటూరుకు సంబంధించిన సమస్యలను గ్రామ రైతులతో కలిసి విన్నవించారు. మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, ఎంపీటీసీ గునపాటి శ్రీనివాసులురెడ్డి, సూరిబాబు, వారాల లక్ష్మీనారాయణ, ఉడతా మురళీయాదవ్, అంబటి వెంకటనారపరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మదనపల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వర్ణ వెంకయ్య జన్మదినం

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత స్వర్ణ వెంకయ్య జన్మదిన వేడుకలను పార్టీ రూరల్ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో కేక్‌ను కట్ చేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం



నెల్లూరు సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.మూడు వేల సాయాన్ని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు, సభ్యులు సాయిరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నగరవనం పనులు త్వరలో పూర్తి


పరిశీలిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నగరవనంలో పనులను 15 రోజుల్లో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరవనంలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రానికే తలమానికంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నారని వివరించారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మండపాలవీధిలోని గురు రాఘవేంద్రస్వామి మఠంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరాధన మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్తరారాధనను వేడుకగా నిర్వహించారు. ఊంజల్‌సేవను రాత్రి జరిపారు. నందగిరి జనార్దన్‌రావు, గురుచరణ్, కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్ఠాన మేనేజర్ శ్రీధరాచార్య, వ్యాసరాజ మఠం మేనేజర్ తడకలూరి రవీంద్రబాబు, సింహపురి మధ్వ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరసు ప్రవీణ్, పత్రి గురురాజా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు శిక్షణ



నెల్లూరు (టౌన్): అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన, ఏఎంఓ సుధీర్‌బాబు, బాలరక్ష భారత్ మేనేజర్ నగేష్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, రిసోర్స్ పర్సన్లు రమేష్, రంగనాథన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ' విద్యార్థుల ర్యాలీ



నెల్లూరు (టౌన్): హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్నెస్సెస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీని జరిపారు. ఎన్నెస్సెస్ ప్రెసిడెంట్ ధనూర్జా, ప్రిన్సిపల్ గిరి, సంస్థ ప్రతినిధులు బాలకృష్ణ, చెన్నమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఉపన్యాసం రేపు

నెల్లూరు(బృందావనం): ఆనందంగా జీవించడంలో ఆధ్యాత్మిక పాత్ర అనే అంశంపై ఉపన్యాసాన్ని నగరంలోని టౌన్‌హాల్ ప్రాంగణంలో గల వర్ధమాన సమాజ మందిరంలో శనివారం నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు యజ్ఞావరుల శేషగిరీశం, డాక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మికవేత్త కర్లపూడి కృష్ణ ఉపన్యసించనున్నారని, కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

'జెనెక్స్' విద్యార్థికి గిన్నిస్ రికార్డు


విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్): హరనాథపురంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న దుర్గాభవాని స్కేటింగ్‌లో గిన్నిస్ రికార్డును సాధించిందని కళాశాల డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు తెలిపారు. విద్యార్థినిని కళాశాలలో గురువారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. కర్ణాటకలోని బెళగావిలో నిర్వహించిన 100 మీటర్ల బ్యాక్ వర్డ్స్ ఆన్ ఇన్‌లైన్ స్కేట్స్ యూజింగ్ టూ వీలర్స్ విభాగంలో నిర్విరామంగా 75 గంటలు స్కేటింగ్ చేసి ఈ రికార్డును సాధించిందని వివరించారు. మరో బీసీఏ విద్యార్థి శ్రీజ ముంబైలో ఇటీవల నిర్వహించిన ఎండ్యురెన్స్ ఇన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ ఈవెంట్‌లో దేశం తరుపున ప్రాతినిధ్యం వహించి మూడు స్వర్ణ పతకాలను సాధించిందని చెప్పారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, స్కేటింగ్ కోచ్ శరత్, ఫిజికల్ డైరెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



కొడవలూరు: మండలంలోని బొడ్డువారిపాళెంలో సాగులో ఉన్న వరి పంటను గురువారం ఏఓ సీహెచ్‌ఎస్.లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను కంకి నల్లి ఆశించి ఉన్నందున నివారించుకోవాలని సూచించారు. కోతకు సమీపిస్తున్న పంటనే కంకి నల్లి ఆశించి ఉన్నందున నివారించుకోకుంటే రైతులు నష్టపోతారన్నారు. ఏఓ వెంట వీఏఏలు కె.శ్రావ్య, ఒ.సుజిత్, జి.ఉమామహేష్, రైతులున్నారు.

పద్మనాభసత్రంలో 'ఫ్యామిలీ డాక్టర్'



కొడవలూరు: మండలంలోని పద్మనాభసత్రంలో ఆ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులిచ్చారు. ఈ సందర్భంగా కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు మాట్లాడుతూ ఆస్పత్రికి రాలేని వారికి ఇంటి వద్దే వైద్య సేవలందిస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ సుధాకర్, ఏఎన్‌ఎం దొరసానమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం సైన్స్ సెంటర్ క్యూరేటర్ సుబ్రహ్మణ్యం రూపొందించిన చంద్రయాన్ – 3, రెండడుగుల వ్యాసం కలిగిన చంద్రుడి నమూనాలను విద్యార్థులకు చూపారు. రాష్ట్ర పరిశీలకులు కల్పన, జిల్లా సైన్స్ ఇన్‌చార్జి గాయత్రి, ఉపాధ్యాయుడు జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌లో లక్ష్యాన్ని సాధించాలి


సూచనలు చేస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు సిటీ: అర్హులందరికీ బీసీజీ వ్యాక్సిన్‌ను వేసి లక్ష్యాన్ని సాధించాలని ఏడీఎంహెచ్‌ఓ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. సౌత్‌మోపూరు పీహెచ్‌సీ పరిధిలోని సేవా జ్యోతి లెప్రసీ కాలనీలో కుష్ఠు రోగులకు ఎమ్సీఆర్ చెప్పులు, మందులను గురువారం అందజేశారు. అనంతరం మన్నవరప్పాడు సబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా లెప్రసీ విభాగ ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, సిబ్బంది శ్రావణ్‌కుమార్, సౌత్‌మోపూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హర్షద్, హెచ్‌ఈఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమీలమ్మకు పురస్కార ప్రదానం



నెల్లూరు(బృందావనం): సామాజికంగా, ఆధ్యాత్మికంగా విస్తృత సేవలందిస్తున్న దొడ్ల ప్రమీలమ్మను పలువురు కొనియాడారు. పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో ప్రమీలమ్మను గురువారం సత్కరించి ఆధునిక శబరిమాత పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం దివ్యాంగులు, పేదలు, వృద్ధులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. వస్త్రాలను పంపిణీ చేశారు. తొలుత శ్రీరామచంద్రమూర్తి చిత్రపటానికి పూజలు చేశారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, అర్చకుడు శ్రీరామచంద్రమూర్తి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, మెట్టు సుధాకర్‌రెడ్డి, పందింటి రఘురామ్, పాముూరు మస్తాన్‌రెడ్డి, ఈదూరు గోపీనాథ్‌రెడ్డి, దగ్గుపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవానీశంకర్ కుటుంబీకులకు పరామర్శ



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏళ్ల పాటు డార్క్ రూమ్ అసిస్టెంట్‌గా పనిచేసిన విశ్రాంత ఉద్యోగి భవానీశంకర్ ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన భార్య, ఏఎన్‌ఎం, హెచ్‌వీ, పీహెచ్‌ఎన్, సీహెచ్‌ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సౌందర్య, కుటుంబసభ్యులను నగరంలోని వారి నివాసంలో హంస నేతలు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. భవానీశంకర్ మృతి చెందడం బాధాకరమని చెప్పారు. గౌరవాధ్యక్షురాలు ఇందిర, అసోసియేట్ ప్రెసిడెంట్ నారాయణరాజు, సలహాదారులు పరిమళ, కల్పం శ్రీనివాసులు, నాగరాజు, ప్రఫుల్ల, తిరుపతిరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పరీక్షలు చేయించాలి


స్పీచ్, హియరింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): పసి పిల్లలకు బెరా, ఓఏఈ పరీక్షలు చేయించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య కోరారు. నగరంలోని పొగతోటలో రిథమ్ స్పీచ్, హియరింగ్ సెంటర్‌ను ఐఎంఏ రాష్ట్ర నేత అశోక్‌తో కలిసి గురువారం ప్రారంభించిన అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. పసి పిల్లల్లో వినికిడి లోపం, ఇతర సమస్యలుంటే ఈ పరీక్షల ద్వారా కనుగొని సకాలంలో నయం చేయొచ్చని చెప్పారు. రిచ్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ భాస్కర్, సైకియాట్రిస్ట్ సుభానీ, ఈఎన్టీ దేను మురళీకృష్ణ, పీడియాట్రిక్ డాక్టర్ రాజేష్, న్యూరాలజిస్ట్ యామిని, డెర్మటాలజిస్ట్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వరి రకాలను సాగు చేయాలి


మాట్లాడుతున్న సత్యవాణి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని రైతులు నూతన వరి రకాలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి కోరారు. రబీ సీజన్‌కు సంబంధించిన నూతన వరి వంగడాలపై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్సీఎం – ఎన్‌ఎల్‌ఆర్ 3648, ఎన్‌ఎల్‌ఆర్ – 3238 వంగడాలు.. రబీ సీజన్లో కేఎన్నెమ్ – 1638, బీపీటీ – 5204, ఆరెన్నార్ – 15048, కేఎన్నెమ్ – 733 రకం వరి విత్తనాలను వాడాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖలో ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకం

నెల్లూరు(బారకాసు): పోస్టల్ శాఖ నిర్వహించే ఫిలాటలీ స్టాంప్ కలెక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రక్రియలో భాగంగా దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన ఫిలాటలీ స్కాలర్‌షిప్‌ను అందజేయనున్నారని నెల్లూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు అర్హులని చెప్పారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులను సాధించి ఉండాలని.. మార్కుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐదు శాతం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి తరగతి నుంచి పది మంది విద్యార్థులను ఎంపిక చేసి, వీరికి ఫిలాటలీ స్కాలర్‌షిప్‌లను అందజేస్తామన్నారు. విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున అందజేయనున్నామని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ రెండు విభాగాల్లో ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరవుతున్నారో వారి పేర్లను నమోదు చేసి పోస్ట్‌మాస్టర్ జనరల్, విజయవాడకు స్టాంపులు అతికించి సెప్టెంబర్ 16లోపు పంపాలని కోరారు. వివరాలకు సమీపంలోని తపాలా శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.